

దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు

దివ్యాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్లకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది.


వివరాలు 8లో ▸



ప్రైవేటు వాహనదారులతో..

జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఇష్టారీతిన ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

ప్యారానగర్ డంప్‌యార్డు అనుమతులు రద్దు చేయాలి

ఎంపీ రఘునందన్ వినతి



ఢిల్లీలో అటవీశాఖ డైరెక్టర్ జనరల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రఘునందన్, జేఏసీ నాయకులు

నర్సాపూర్: ప్యారానగర్ డంప్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్‌కుమార్ అవస్తిని కలసి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో నిర్మిస్తున్న డంప్‌యార్డు అనుమతులను రద్దు చేయాలని ఎంపీ కోరారు. డంప్‌యార్డ్‌కు సంబంధించిన పలు అంశాలను రఘునందన్ వివరించారు. ఎంపీ వెంట నర్సాపూర్ జేఏసీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, గుమ్మడిదల మండలానికి చెందిన జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

సంగారెడ్డి వరకు మెట్రోను పొడిగించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

పటాన్‌చెరు టౌన్: మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలును పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామికభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో మెట్రో రైలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డినుంచి హైదరాబాద్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తున్నారని ఈ ప్రాంతానికి మెట్రో తప్పనిసరిగా కేటాయించాలని కోరారు. ప్రభుత్వ హామీలు అమలుకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య, ఏరియా కార్యదర్శి నాగేశ్వరావు, పాండు రంగారెడ్డి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దళితులనే వివక్షతో గ్రామపంచాయతీ కార్మికులను ఇష్టానుసారంగా విధుల నుంచి తొలగిస్తున్నారని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కులవివక్షపోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేవీపీఎస్ నాయకులు సంగారెడ్డిలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఏవోకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ...కొన్నేళ్ల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్యం, వాటర్, ఎలక్ట్రీషన్ విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కంగ్టి మండలంలో కంగ్టి, దేగుల్వాడి,భీంరా తదితర గ్రామాలలో కార్మికులను తొలగించి వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో తొలగించిన జీపీ కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని లేదా వారి స్థానంలో కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి దాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని హనుమాన్‌నగర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక, మట్టిని రవాణా చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తున్న ఆరు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ...ఇసుక, మట్టి అక్రమ రవాణా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపాలిటీలవైపే మొగ్గు

- విలీన పంచాయతీల కార్యదర్శులకు ఆప్షన్లు అడిగిన మున్సిపల్ శాఖ
- బల్దియాల్లో పనిచేసేందుకే ఎక్కువమంది ఆసక్తి
- జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లోకి...



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో పలు గ్రామాలను ప్రభుత్వం ఇటీవల సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. మరికొన్ని గ్రామాలతో కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. ఇలా విలీనమైన గ్రామాలు, కొత్త మున్సిపాలిటీలుగా మారిన గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులు ఇకపై మున్సిపాలిటీ శాఖలో పనిచేస్తారా..? లేదా పంచాయతీరాజ్ శాఖలో కొనసాగుతారా? అనే దానిపై నిర్ణయం తెలపాలని మున్సిపల్‌శాఖ ఆప్షన్లు కోరింది. దీంతో ఎక్కువమంది పంచాయతీ కార్యదర్శులు మున్సిపాలిటీల్లో పని చేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

రెండు విడతలుగా నిర్ణయం..

జిల్లాలో మొదటి విడతలో పటాన్‌చెరు మండలంలోని ఐదు గ్రామాలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసింది. అలాగే అమీన్‌పూర్ మండలంలోని ఆరు గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో కలిపింది. ఇలా మొత్తం 11 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలను సమీప మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ఆరు నెలల క్రితం నిర్ణయం తీసుకుంది. రెండో విడతలో ఇస్నాపూర్, గుమ్మడిదల, గడ్డపోతారం గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చుతూ జనవరి మొదటి వారంలో నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ మూడు మున్సిపాలిటీల్లో మొత్తం 14 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారాయి. మరోవైపు కోహీర్ గ్రామ పంచాయతీ కూడా మున్సిపాలిటీగా మారింది. ఇలా మొత్తం 26 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారాయి. అయితే ఈ 25 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు ఇకపై పంచాయతీరాజ్‌శాఖలోనే కొనసాగుతారా..? మున్సిపాలిటీల్లో ఉంటారా? అనే అంశంపై మున్సిపల్‌శాఖ ఇటీవల ఆప్షన్లను అడిగింది. నలుగురైదుగురు మినహా మిగిలిన వారంతా మున్సిపల్ శాఖ వైపే మొగ్గు చూపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అర్బన్ ఏరియాల్లో పనిచేసే అవకాశం కోసం..

మున్సిపల్‌శాఖలోకి వెళితే అర్బన్ ఏరియాలో పనిచేసే అవకాశం ఉంటుంది. దీంతో చాలా మంది మున్సిపాలిటీల్లో ఆప్షన్లు ఇచ్చే యోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపల్‌శాఖలోకి వెళితే సీనియారిటీ అంశం అటుంచితే కాస్త తొందరగా పదోన్నతులు వచ్చే అవకాశాలున్నాయి. గ్రేడ్–1 కార్యదర్శి మున్సిపాలిటీలో మేనేజర్ క్యాడర్ పోస్టు వస్తుంది. ఇది కూడా ఎక్కువ మంది మున్సిపాలిటీ వైపు వెళ్లేందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తక్షణ పదోన్నతుల జాబితాలో ఉన్న అతి కొద్దిమంది మాత్రమే పంచాయతీరాజ్‌శాఖలో కొనసాగాలని భావిస్తున్నారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే చాలా మంది విలీన గ్రామ పంచాయతీల్లో డిప్యూటేషన్లపై కొనసాగుతున్నారు. ఇలా డిప్యూటేషన్లపై కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల విషయంలో జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం ఎలా ఉంటుందనేది వేచి చూడాల్సిందే.



డిగ్రీలో ఏఐ విద్య

- రానున్న విద్యాసంవత్సరం నుంచి అమలుకు నిర్ణయం
- ఉన్నత విద్యామండలి కసరత్తు
- సిలబస్ రూపొందించే పనిలో విద్యావేత్తలు

నారాయణఖేడ్: పోటీ ప్రపంచంతో మనం కూడా పోటీ పడాలంటే మారుతున్న కాలానికనుగుణంగా విద్యావిధానంలో మార్పులు అవసరం అన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ఉన్నత విద్యావిధానంలో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇందులోభాగంగా డిగ్రీ విద్యావిధానంలో నూతన కోర్సులను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తుంది. ఏఐ విద్యను బీఏ, బీకాం కోర్సుల్లోనూ ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వాలని ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. 2025– 26వ విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా ఏఐలో మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనాలసిస్ వంటి కోర్సులను చదివే విధంగా నిబంధనలను సవరించాలని నిర్ణయించింది. బీఏ, బీకాంలో ఉండే సబ్జెక్టులకు తోడు మొదటి సంవత్సరంలో ఏఐ, రెండో సంవత్సరంలో మెషీన్ లెర్నింగ్, మూడో సంవత్సరంలో సైబర్ సెక్యూరిటీలను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ఆయా విశ్వవిద్యాలయాల విభాగాల సబ్జెక్టుల నిపుణులతో కీలక సమావేశం నిర్వహించిన ఉన్నత విద్యామండలి కృత్రిమ మేధ, అడ్వాన్స్ కోర్సులను అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

జిల్లా విద్యార్థులకు మేలు...

జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏడు కొనసాగుతున్నాయి. సంగారెడ్డిలో, పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్ జోగిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. పటాన్‌చెరులో 10వరకు, సంగారెడ్డిలో 5, జహీరాబాద్‌లో 5, నారాయణఖేడ్‌లో 4, సదాశివపేట్‌లో 2, జోగిపేటలో 1 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ఏఐకు సంబంధించిన కోర్సులు ప్రవేశపెట్టిన పక్షంలో విద్యార్థులకు ఉపయుక్తంగా మారనుంది.

జీవితంలో నిలదొక్కుకునేందుకే...

సైన్స్ కాకుండా ఆర్ట్స్ విభాగంలో బీఏ, బీకాం కోర్సులు చేసిన చాలామంది విద్యార్థులు టెక్నికల్ కోర్సులు కాకపోవడం, ఇతర ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత లేకపోవడంతో డిగ్రీ చదివి నష్టపోతున్నారు. జీవితంలో నిలదొక్కుకోవాలంటే రానున్న భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏఐ టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలని సంకల్పించారు. ఇందుకు సంబంధించిన ఏఐ సిలబస్‌ను రూపొందించేందుకు ఆయా రంగాల్లో పనిచేస్తోన్న విద్యావేత్తలు సిలబస్ రూపొందించనున్నారు. డిగ్రీలో అడ్మిషన్లు మొదలైన వెంటనే ఆయా సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, కోర్సు మెటీరియల్‌ను ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

నిమ్జ్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రెవెన్యూ, నిమ్జ్ అధికారులతో భూసేకరణపై సమీక్ష



నిమ్జ్ ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సంగారెడ్డిజోన్: నిమ్జ్ ఏర్పాటుతో అక్కడి ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని, అందుకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, రెవెన్యూ అధికారులతో నిమ్జ్ భూసేకరణపై కలెక్టర్ క్రాంతి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో గ్రామాల వారీగా చేసిన భూసేకరణ వివరాలు, ఇంకా ఎంత సేకరణ చేయాల్సి ఉంది అన్న వివరాలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం చేపట్టిన నిమ్జ్ ఏర్పాటుతో జహీరాబాద్ నియోజకవర్గం రూపురేఖలు మారిపోతాయన్నారు. భూములిచ్చిన వారికి నష్టపరిహారం అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రారంభమైన పలు అభివృద్ధి పనులను ఈనెల 24లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రామ్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అలియాబాద్‌లో యాదాద్రి మోడల్‌ను పరిశీలిస్తున్న రాజస్థాన్ ప్రతినిధులు

ఈ-పంచాయతీ చెల్లింపులు ఎలా?

రాజస్థాన్ ప్రజాప్రతినిధుల ఆరా

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని తొగర్‌పల్లిలో మంగళవారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు పర్యటించారు. తొగర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంతోపాటు ఈ పంచాయతీ ద్వారా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు, చెల్లింపులు ఏ విధంగా జరుగుతున్నాయి అనే విషయంపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని అలియాబాద్ గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో పంచాయతీ, ఉపాధి హామీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనం, నర్సరీలతోపాటు యాదాద్రి మోడల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ప్రజాప్రతినిధులు గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి హామీపనులతోపాటు పల్లె ప్రకృతి వనం నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లో కూడా గ్రామాలలో ఎలాంటి పథకాలు అమలు చేయాలనే విషయంపై తెలంగాణలో పర్యటిస్తున్నట్లు వారు తెలిపారు.

భరోసా పనితీరు భేష్

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: భరోసా కేంద్రంలోని సిబ్బంది పనితీరు బాగుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. విధుల్లోగానీ, వ్యక్తిగతంగా గానీ ఎలాంటి సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలకు అందించిన సేవలను, నిర్వహించిన కౌన్సిలింగ్, భరోసా సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో కౌన్సిలింగ్ రూమ్, మెడికల్ రూమ్, లీగల్ సపోర్టింగ్ రూమ్, వీడియో కాన్ఫరెన్స్ రూమ్ లలో కలియతిరిగారు. అనంతరం కార్యాలయం రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...భరోసా కేంద్రం సిబ్బంది బాధిత మహిళలకు వెన్నంటి ఉండి వారికి అసరమైన మెడికో లీగల్ సేవలు సత్వరమే అందించాలన్నారు. అవసరమైన కేసులలో భరోసా సిబ్బంది బాధిత మహిళల ఇళ్లను సందర్శించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. మహిళా సంబంధిత నేరాల గురించి వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, భరోసా కో–ఆర్డినేటర్ దేవలక్ష్మి, భరోసా సిబ్బంది తదితరులున్నారు.

గీతంకు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్రాంట్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు మరో ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్టీ)లోని అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతాహర్ రెజాకు పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ రెజాకు సహాయకారిగా జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) అవసరమని తెలిపారు. ఎంటెక్ లేదా ఎమ్మెస్సీ (గణితం) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, గేట్ లేదా నెట్ అర్హతతోపాటు మ్యాట్ ల్యాబ్ ప్రోగ్రామింగ్‌లో ప్రావీణ్యం ఉన్న 32 ఏళ్ల వయస్సు లోపు వారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు, మహిళలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది) దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జేఆర్ఎఫ్‌గా ఎన్నికైన వారికి నెలకు రూ.37 వేల భత్యంతోపాటు ఇంటి అద్దె అలవెన్సు కూడా ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డాక్టర్ రెజా 78730 49059ను సంప్రదించాలని సూచించారు.

నేతన్నల స్థితిగతులపై అధ్యయనం

23న హన్మంత్‌రావుపేట్‌లో పద్మశాలీ సంఘం నేతల పర్యటన



సమావేశమైన పద్మశాలీ సంఘం నేతలు



'సాక్షి'కథనం క్లిప్పింగ్

సాక్షి ఎఫెక్ట్

నారాయణఖేడ్: నాడు వెలుగు వెలిగి నేడు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట్ పద్మశాలీల జీవన స్థితిపై 'సాక్షి' దినపత్రికలో 'సిరుల దారం...నిరాధారం, ఆదుకున్న ఊరు ఆగమైంది' శీర్షికన ప్రచురితమైన కథనానికి పద్మశాలీ సంఘం, యువజన సంఘం సభ్యులు స్పందించారు. వారి స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నడుంకట్టారు. నారాయణఖేడ్‌లో పద్మశాలీ సంఘం బాధ్యులు, యువకులు మంగళవారం సమావేశమయ్యారు. గ్రామానికి ఈ నెల 23న వెళ్లి గ్రామం పరిస్థితి, నాటి వైభవం, నేటి దీన జీవనం, స్థితిగతులపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా నేత కార్మికుల జీవన ప్రమాణాలు పెరగకపోవడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సేకరించిన సమాచారం మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని, గ్రామం పునరుజ్జీవం అయ్యేలా కృషి చేస్తామని ప్రకటించారు. గ్రామ పద్మశాలీల జీవన ప్రగతి మార్పుకు తమ వంతుగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా పద్మశాలీల జీవన స్థితిగతులపై 'సాక్షి'లో వచ్చిన కథనం క్లిప్పింగ్ పద్మశాలీ రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘాలు, స్థానిక వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. చాలామంది క్లిప్పింగ్‌ను వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు.

పన్ను వసూళ్లు 86శాతం పూర్తి

- జిల్లాలో 633 పంచాయతీలు
- 287 జీపీల్లో పూర్తయిన పన్ను వసూళ్ల ప్రక్రియ
- నెలాఖరుకు 100 శాతం పూర్తి చేయాలని లక్ష్యం



ఇంటి పన్ను రసీదును పరిశీలిస్తున్న ఎంపీడీవో

న్యాల్‌కల్ (జహీరాబాద్): జిల్లాలో ఇంటి పన్నుతోపాటు ఇతర పన్నులు వసూలు చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. గతంలో వసూలు చేసిన మాదిరిగా పన్నులను నిర్ణీత సమయానికంటే ముందే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పన్నులు వసూలు చేసేందుకు ఇంటి బాట పట్టారు. ఈ నెలాఖరు వరకు వందశాతం పన్నులు తప్పకుండా వసూలు చేసేందుకు కార్యదర్శులు ఇళ్లన్నీ తిరిగి పన్నులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో 27మండలాలు, 633 గ్రామ పంచాయతీలున్నాయి. జిల్లావ్యాప్తంగా రూ.23,54,92,355 పన్నులు వసూలు చేయవలసి ఉండగా ఇప్పటివరకు జిల్లాలో రూ.20,45,71,746 (86.87%) పన్నులు వసూలు అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 27 మండలాలు ఉండగా అందులో ఏ ఒక్క మండలంలో కూడా వంద శాతం పన్నులు వసూలు కాలేదు. అందోల్, మనూర్, నాగిల్‌గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, అత్నూర, పటాన్‌చెరువు, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లో 90 శాతానికి పైగా పన్నులు వసూలు అయ్యాయి. వట్‌పల్లి, అమీన్‌పూర్, జిన్నారం, సంగారెడ్డి మండలాల్లో ఒక్క గ్రామ పంచాయతీ కూడా వంద శాతం పన్నులు వసూలు చేయలేదు. జిల్లాలో 99.62% పన్నులు వసూలు చేసిన నాగిల్‌గిద్ద మండలం మొదటి స్థానంలో ఉండగా, 65.56% పన్నులు వసూలు చేసిన కంగ్టి మండలం చివరి స్థానంలో నిలిచింది.

గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ

వసూలు చేసిన పన్నులను పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రజలంతా ఇంటి పన్నుతోపాటు ఇతర పన్నులు తప్పకుండా కట్టాలని, పన్నులు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచారం చేస్తున్నారు. ఇళ్లన్నీ తిరిగి వసూలు చేసిన సొమ్మును ఎప్పటికప్పుడు బ్యాంక్‌ల ద్వారా పంచాయతీల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. వసూలు చేసిన పన్నులతో ఆయా గ్రామాల్లో మంచి నీటి ట్యాంక్‌లు, మురికి కాల్వలను శుభ్రం చేయించడం, పగిలిన పైప్‌లైన్లకు, లీకేజీల మరమ్మతులు చేయించడం, వీధి దీపాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పన్నుల చెల్లింపు ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ వాటిని వసూలు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పన్నుల వసూలుకు ఇంకా 13 రోజుల సమయం మాత్రమే మిలిగి ఉంది. ఈలోగా పన్నులు వంద శాతం వసూలు అవుతాయా? లేదా వేచి చూడవలసిందే.

80 శాతం పన్నులు వసూలు చేశాం



పన్నులు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నా. వారు చెల్లించిన పన్నులను గ్రామాభివృద్ధి కోసమే వినియోగిస్తామని చెప్తున్నా. 80% పన్నులు వసూలు చేశా. వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తా.

–ధన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి–న్యాల్‌కల్

ఈ నెలాఖరుకు లక్ష్యాన్ని చేరుకుంటాం

ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేసి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటి వరకు జిల్లాలో 86 శాతం మేర పన్నులు వసూలు చేశాం. అన్ని గ్రామాల్లో కార్యదర్శులు ఇల్లిల్లూ తిరిగి పన్నులు వసూలు చేస్తున్నారు.

–సాయిబాబా, డీపీవో–సంగారెడ్డి

క్లుప్తంగా

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి బాలుడు



మెడల్‌తో ధ్రువకరణ్ రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో మూడున్నరేళ్ల ధ్రువకరణ్ రెడ్డి చోటు సంపాదించాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు తోట కరుణాకర్ రెడ్డి ప్రస్తుతం కొడిపల్లి నివాసం ఉంటూ మండలం పీర్యతండా ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. కరుణాకర్‌రెడ్డి, ప్రియాంక దంపతులకు కుమారుడు ధ్రువకరణ్ రెడ్డి(మూడున్నరేళ్లు), కూతురు ప్రవస్థ (2) ఉన్నారు. ధ్రువకరణ్ రెడ్డికి తల్లిదండ్రులు దేశంలోని వివిధ రాష్ట్రాలు, వాటి రాజధానులు, వివిధ దేశాల జాతీయ జెండాలు, నాయకుల పేర్లు, ఫ్లాష్ కార్డులు గుర్తింపులో ప్రత్యేక శిక్షణ ఇవ్వగా బొమ్మలు చూపగానే టక్కున గుర్తిస్తున్నాడు. గత నెలలో ధ్రువకరణ్ రెడ్డి దేశంలోని 28 రాష్ట్రాలు, వాటి రాజధానులను 46.58 సెకన్లలో గుర్తించగా వీడియో రికార్డు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపించారు. పరిశీలించిన ప్రతినిధులు అతడి వయసు, సమయం ఆధారంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు కల్పించి సర్టిఫికెట్ పంపిణీ చేశారు. మెడల్, సర్టిఫికెట్ మంగళవారం అందించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి


పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

తొగుట(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీటాఫీసర్ నరేశ్ కథనం మేరకు.. తొగుట పెట్రోల్ పంపు సమీపంలో నెమలి మృతి చెంది ఉందని గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లి నెమలిని పరిశీలించగా మరణించింది. స్థానిక పశు వైద్యాలయానికి తీసుకెళ్లగా పశువైద్యాధికారి రమేశ్ పోస్టుమార్టం నిర్వహించారు. తదుపరి నిర్ధారణ, ఆధారాల కోసం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించామని అధికారి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండలానికి చెందిన దండు చంద్రవ్వ కుమారుడు పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుంది. మంగళవారం మధ్యాహ్నం నిజాంపేటకు చెందిన ఘడీం చెరువులో ఆత్మహత్యాయత్నం చేసింది. అటుగా వెళ్తున్న కుమార్ అనే వ్యక్తి గమనించి ఆమెను పైకి తీసుకొచ్చారు. వెంటనే 108కి సమాచారం అందించి రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

రంగనాయక సాగర్ వద్ద అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ వద్ద గల ఇరిగేషన్ ఎస్‌ఈ కార్యాలయం సమీపంలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండుగంట పాటు శ్రమించి మంటలార్పారు.

దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు



సదరం సర్టిఫికెట్ స్థానంలో యూడీఐడీ కార్డులు

అర్హులైన దివ్యాంగులను వైకల్య శాతాన్ని బట్టి ఇప్పటి వరకు జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాలకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది. వీటి స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అంగవైకల్య యూడీఐడీ (యూనిక్ డిసెబుల్ ఐడెంటిటీ కార్డు) ను జారీ చేయనుంది. ఈ కార్డులను ఈ నెల నుంచి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తున్న వివరాలతోపాటుగా వైద్యులు వైకల్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఎలాంటి తప్పులు జరిగేందుకు వీలు లేకుండా ఉంటుంది. 21 రకాల వైకల్యం కలిగి ఉన్న అర్హులైన దివ్యాంగులకు ఈ కార్డులను అందించనున్నారు. ఒకే దేశం ఒకే కార్డు విధానంలో ఈ కార్డు దేశం అంతటా పనిచేసేందుకు వీలు ఉండనుంది.

– సిద్దిపేటరూరల్

- 3 రంగుల్లో అందించనున్న ప్రభుత్వం
- 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులు అర్హులు
- ఈ నెల నుంచి అమల్లోకి..
- పోర్టల్ ద్వారా దరఖాస్తులకు ఆహ్వానం
- జిల్లా వ్యాప్తంగా 1,86,000 మంది

ప్రస్తుతం సదరం సర్టిఫికెట్లు ఏడు కేటగిరీల్లో మాత్రమే అందించడం జరిగింది. మరో 14 కేటగిరీలను కలుపుకొని మార్చి నెల నుంచి యూనిక్ డిసెబిలిటీ గుర్తింపు కార్డులు 21 కేటగిరీల వారీగా అందించనున్నారు. యూడీఐడీ కార్డు కోసం ఎప్పటి మాదిరిగానే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపునకు హాజరు కావాలి. గతంలో మాదిరిగానే మీసేవా కేంద్రంలో గాని, ఫోన్‌లో గాని స్లాట్ బుక్ చేసుకొని క్యాంపునకు వెళ్లాలి. అనంతరం నిపుణులైన వైద్యులు పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తారు. దరఖాస్తు వివరాలు, వైకల్యశాతం, వైద్యుల లాగిన్‌కు చేరుతుంది. అక్కడ వివరాలు పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారి సంతకంతో కూడిన కార్డు మంజూరవుతుంది.

3 రంగుల్లో కార్డులు..

ప్రభుత్వం ప్రతీ శనివారం ఏర్పాటు చేయనున్న సదరం క్యాంపుల్లో వైకల్యం సంబంధించి వైద్యులు పరీక్షిస్తారు. అనంతరం పరీక్షల వివరాలు, లోపాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు, లోపాలను బట్టి వైకల్య శాతం జనరేట్ అవుతుంది. ఈ శాతాన్ని మార్చడానికి వైద్యులకు ఎలాంటి అవకాశం ఉండదు. ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ రూపొందించడం ద్వారా ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఈ శాతాన్ని అనుసరించి యూడీఐడీ కార్డులు మూడు రంగుల్లో ఇవ్వనున్నారు.

ఇప్పటికే ఉన్న ధ్రువపత్రం ఉపయోగం

సదరం క్యాంపులో భాగంగా వైకల్యం గుర్తించబడి శాశ్వతంగా పెన్షన్ మంజూరీకి ధ్రువపత్రాన్ని పొందిన వారు కూడా ఈ పోర్టల్ దరఖాస్తు చేసుకొని పర్మినెంట్ యూడీఐడీ కార్డును పొందేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ధ్రువపత్రం అన్ని రకాలుగా వినియోగించుకునేందుకు వీలుంది.


సదరం క్యాంపు

పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్ www.swavlambancard.gov.inలో సంబంధిత వివరాలతో ఆన్‌లైన్‌లో గాని, మొబైల్ ఫోన్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్ ప్రకారం ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు పరీక్షలు నిర్వహించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఆటోమెటిక్‌గా వైకల్య శాతం జనరేట్ చేసి గుర్తింపు కార్డులు అందించడం జరుగుతుంది. చిరునామా వివరాలు నమోదు చేయడం ద్వారా ఇంటికే స్పీడ్ పోస్టు ద్వారా యూడీఐడీ కార్డు పంపించడం జరుగుతుంది. ప్రతీ వ్యవహారానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ ఫోన్‌కు సమాచారం అందించడం జరుగుతుంది. ఒక్కసారి కార్డు మంజూరైతే శాశ్వతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. దేశంలో ఎక్కడికి వెళ్లినా ఈ కార్డు పని చేస్తుందని, రైళ్లు, బస్సుల్లో సైతం ప్రాధాన్యంతోపాటుగా పలు రకాల సౌకర్యాలను కూడా పొందవచ్చు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో పెన్షనర్ల వివరాలు

దివ్యాంగులు	– 13,793
వృద్ధులు	– 59,242
వితంతువులు	– 55,060
గీత కార్మికులు	– 2,942
చేనేత	– 2,206
హెచ్ఐవీ	–1,034
ఫైలేరియా	– 2,441
డయాలసిస్	– 103
ఒంటరి మహిళలు	– 3,417
బీడీ కార్మికులు	– 45,473
బీడీ టైకేదార్లు	– 2,078
మొత్తం పెన్షనర్లు	– 1,86,000

తప్పులు లేకుండా నమోదు



దివ్యాంగులు యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఫోన్‌లో గాని, మీసేవా కేంద్రంలో గాని ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా వివరాలు నమోదు చేయాలి. తప్పులను సరి చేయడానికి మళ్లీ అవకాశం ఉండదు. పోర్టల్‌లో సూచించిన విధంగా అవసరమైన వివరాలను బట్టి వైకల్యశాతం నమోదవుతుంది. తర్వాత మార్చడానికి వీలు ఉండదు. ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి.

జయదేవ్‌ఆర్యా,
జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

పీఎం శ్రీతోపాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి


అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఐసీడీఎస్‌లను రద్దు చేయాలని తెచ్చిన పీఎం శ్రీపథకంతోపాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు పెద్ద ఎత్తున సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ.. దేశంతోపాటు రాష్ట్రంలో ఐసీడీఎస్ ప్రారంభమై 50 ఏళ్లు అవుతుందన్నారు. ఐసీడీఎస్‌ను, సేవలను సంస్థాగతం చేయాలని, ఇందులో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను, మినీ టీచర్లను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఆదేశాలిచ్చాయన్నారు. ఇలాంటి పరిస్థితిలో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూడటం అన్యాయమన్నారు. మొబైల్ అంగన్ వాడీ సేవల పేరుతో కొత్త విధానాన్ని తెచ్చి ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా కోశాధికారి జీ.భాస్కర్, సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ, పద్మ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గొర్రెలు అమ్మేశారని మనస్తాపంతో..

బావిలో దూకి వృద్ధురాలు బలవన్మరణం

సిద్దిపేటకమాన్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. స్థానిక నర్సాపూర్‌లో నివాసం ఉంటున్న బండారి పోశవ్వ (60) తమకు ఉన్న గొర్రెలను పెద్ద వాగు వైపు ప్రతి రోజూ తీసుకెళ్లి మేపేది. తమ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో గొర్రెలను అమ్మేయడంతో నిత్యం బాధపడుతుండేది. 16న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నర్సయ్య వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. గొర్రెలు అమ్మడంతో మనస్తాపానికి గురై తల్లి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి


ఎల్లం (ఫైల్)

దుబ్బాకటౌన్ : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయపోల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గూని ఎల్లం (40) వ్యవసాయం, కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై భార్య నవనీతతో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి నిద్రించిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఎల్లం ఇంట్లో నుంచి వెళ్లి పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

ఉరేసుకొని యువకుడు


గర్గుల భాను (ఫైల్)

నిజాంపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గర్గుల రాజు, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గర్గుల భాను(17) పదవ తరగతి పూర్తి అయిన తర్వాత గ్రామంలోనే కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులు వేరే గ్రామానికి వెళ్లగా భాను ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలో నుంచి శబ్దం రాకపోవడంతో పక్క ఇంట్లో ఉన్న స్నేహితుడు వెళ్లి చూశాడు. తాడుకు వేలాడుతున్న మిత్రుడిని చూసి ఇంటి తలుపులు పగులగొట్టి 108లో దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి


బీరప్ప (ఫైల్)


నర్సింలు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయం వద్ద మంగళవారం స్నానం చేయడానికి వెళ్లి నీటి మునిగి భక్తుడు మృతి చెందాడు. ఏఎస్‌ఐ సంగన్న కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరాస్తాకు చెందిన బీరప్ప (45) కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఏడుపాయల వచ్చాడు. ఉదయం స్నానం చేయడానికి అక్కడి సమీపంలో ఉన్న నాగ్‌సాన్‌పల్లి ఫతేనగర్ కాల్వలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బీరప్ప నీట మునిగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కూలీ..

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కూలీ మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దిడ్గి గ్రామానికి చెందిన దేవరంపల్లి నర్సింలు(30) సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్ వెనుకాల భవన నిర్మాణం పనులు జరుగుతుండగా సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఇనుప రాడ్లను భవనం పైకి తీసుకెళ్తున్న క్రమంలో పైనుంచి వెళ్లిన 11 కేవీ కరెంట్ లైన్‌కు తాకింది. దీంతో కరెంట్ షాక్ తగిలి కింద పడ్డాడు. వెంటనే జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో సంగారెడ్డి తీసుకెళ్తుండగా మృతి చెందాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు

వట్‌పల్లి(అందోల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని చింతకుంట గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన పెద్దబోయిన సాయి(25) బైక్‌పై మంగళవారం రాత్రి చింతకుంట నుంచి జోగిపేటకు వస్తున్నాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మంజీరా నదిలో కుళ్లిన కోళ్లు


మంజీరా నదిలో మృతి చెందిన కోళ్లు

పాపన్నపేట(మెదక్): మంజీరా జలాలు కుళ్లిన కోళ్ల మృతదేహాలతో కలుషితమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేట మండలం ఎల్లాపూర్ బ్రిడ్జి కింది నుంచి ప్రవహించే మంజీరా నదిలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ సంఖ్యలో మృతి చెందిన కోళ్లను పడేశారు. అవి కాస్త కుళ్లిపోయి జలాలు కలుషితమవుతున్నాయి. ఇటీవలె విస్తరిస్తున్న బర్డ్‌ఫ్లూ వ్యాధి వల్లే కోళ్లు చనిపోయి ఉంటాయని భావిస్తున్నారు. ఈ నీటిని దిగువన మెదక్ పట్టణానికి తాగునీరుగా సరఫరా చేస్తారు. ఇలా కలుషితం చేస్తే ప్రజలు రోగాల బారిన పడుతారని ఆందోళన వ్యక్తమవుతోంది.

చనిపోయిన వ్యక్తి ఖాతా నుంచి రూ.1.02 లక్షలు బదిలీ

నర్సాపూర్ రూరల్: మూడేళ్ల కిందట చనిపోయిన వ్యక్తి ఖాతా నుంచి రూ.1.02 లక్షలు ఇతరుల ఖాతాకు బదిలీ చేసిన ఘటన నర్సాపూర్ ఎస్‌బీఐలో వెలుగు చూసింది. మృతుడి కుమారుడు నాగమొల్ల లక్ష్మయ్య కథనం మేరకు.. మా తండ్రి నాగమొల్ల ఆగమయ్య మూడేళ్ల కిందట చనిపోయాడు. అతడికి నర్సాపూర్ ఎస్‌బీఐ(అగ్రికల్చర్) బ్యాంకులో ఖాతా ఉంది. అందులో రూ.లక్షా 50 వేల 480 ఉన్నాయి. ఫిబ్రవరిలో బ్యాంక్‌కు వెళ్లి ఆ డబ్బులు కావాలని అడిగాం. డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొచ్చి నీ పేరు మీద ఖాతా ఓపెన్ చేస్తే ఆ డబ్బులను బదిలీ చేస్తామని ఫీల్డ్ ఆఫీసర్ అశోక్ చెప్పాడు. ఫిబ్రవరి 5న డెత్ సర్టిఫికెట్ తీసుకొని వెళ్లగా నా పేరు మీద ఖాతా ఓపెన్ చేసి అందులో రూ.50 వేలు బదిలీ చేశాడు. మళ్లీ 10న రూ.లక్షా 2 వేల 300ను ఇతరుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విషయమై ఫీల్డ్ ఆఫీసర్‌ను అడుగగా తప్పిదం జరిగిందని తెలిపాడు. ఈ విషయమై ఎస్‌బీఐ మేనేజర్ సునీల్ గాంధీని వివరణ కోరగా మా దృష్టికి కూడా వచ్చిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడుతామని తెలిపారు.

గుట్కాల లారీ పట్టివేత

తూప్రాన్: గుట్కాల లోడ్‌తో వెళ్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. ఆయన కథనం మేరకు.. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎంలో ఎలాంటి అనుమతులు లేని రూ.లక్షల్లో విలువైన సాగర్ (పాన్ మసాలా) గుట్కాలను గుర్తించామన్నారు. సుమారు 200 బస్తాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వాణిజ్య పన్నుల అధికారులకు సమాచారం అందించి డీసీఎంను అప్పగించామన్నారు.

చిరుతపులి సంచారం కలకలం

- రాయపోల్–తిమ్మక్కపల్లి శివారులో చూసిన రైతులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు


రైతులు తీసిన చిరుతపులి ఫొటో

దుబ్బాక : రాయపోల్–తిమ్మక్కపల్లి గ్రామాల మధ్యనున్న గల్వని చెరువు ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాయపోల్–తిమ్మక్కపల్లి గ్రామాల రైతులకు మంగళవారం గల్వనిచెరువు ప్రాంతంలో చిరుత పులి కనిపించింది. చిరుతపులి తిరుగుతున్న ఫొటోలను పలువురు రైతులు దూరం నుంచి సెల్‌ఫోన్‌లో తీసి పలు గ్రూపుల్లో షేర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘుపతి వెంటనే అక్కడికి చేరుకొని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతంలో సంచరిస్తుంది చిరుతనా..? లేక మరో జంతువా.. అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో రాయపోల్, తిమ్మక్కపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుతపులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చిరుతపులి సంచారం వార్త రాయపోల్, తిమ్మక్కపల్లి గ్రామాల్లో తీవ్ర కలకలం లేపింది. ఆ ప్రాంతంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


నరేశ్ (ఫైల్)

సంగారెడ్డి టౌన్ : మంజీరా గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. అందోల్ మండలం కుమ్మరిగూడెంకు చెందిన మ్యాదరి నరేశ్ (30) కొద్దిరోజులుగా భార్య దుర్గతో కలిసి ఇస్నాపూర్‌లో డ్రైవింగ్ పనిచేస్తూ అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఆదివారం తమ్ముడు నరేందర్, స్నేహితులతో కలిసి మంజీరా డ్యాంలో సరదాగా ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ నరేశ్ ఆవలి వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజులకు యువకుడి మృతదేహం దొరికింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

యువకుడికి పాముకాటు : పరిస్థితి విషమం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని దుర్గా వైన్స్‌లో పనిచేసే మండలంలోని యశ్వంతరావ్‌పేటకు చెందిన ప్రభాస్‌గౌడ్(20)ను పాముకాటు వేసింది. మద్యం కాటన్‌లను తీస్తున్న క్రమంలో మంగళవారం రాత్రి నాగుపాము కాటు వేయగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధితుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. యువకుడి ఆరోగ్యం ప్రస్తుతం విషమంగానే ఉన్నట్లు తెలిసింది.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగింత
- లారీ యజమానులు, డ్రైవర్లపై కేసు

500 క్వింటాళ్లు మహారాష్ట్రకు తరలింపు


లారీలు పట్టుకున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అక్రమంగా మహారాష్ట్రకు పక్కదారి పట్టిస్తున్న భారీ రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం మేరకు.. సంగారెడ్డి–నాందేడ్ 161 నేషనల్ హైవే మీదుగా లారీల్లో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం అందింది. కల్హేర్ మండలం మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలో తనిఖీలు నిర్వహించి రెండు లారీల్లో బియ్య గుర్తించాం. మహారాష్ట్రలోని నాందేడ్‌కు బియ్యం తీసుకెళ్తున్నట్టు డ్రైవర్లు తెలిపారు. కంగ్టీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించడంతో సివిల్ సప్లయ్ డీటీ విజయలక్ష్మి, మహేశ్, ఆర్ఐ మల్లేశం వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. రెండు లారీలు, బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యం నారాయణఖేడ్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్ బియ్యం తూకం పరిశీలించారు. సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదు మేరకు లారీ యజమానులు అయూబ్ అలీ, మీర్జా, డ్రైవర్లు ఖాజామియా, జుల్ఫీఖర్‌పై కేసు నమోదు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

కూచారం శివారులో 300 క్వింటాళ్లు

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను లారీలో శ్రీశైలం రోడ్ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు మనోహరాబాద్ మండలం కూచారం శివారులో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నాం. రెవెన్యూ ఆర్ఐ దీక్షిత్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ షేక్ షోయబ్, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి లారీని తూప్రాన్‌లోని గోదాముకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


నిల్వ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఓ ఇంట్లో 25.70 క్వింటాళ్లు నిల్వ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో గల శ్రీనివాస్ నివాస గృహంలో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పండరినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేసి అక్రమంగా నిల్వ చేసిన 25.70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం ఎస్‌ఐ నారాయణగౌడ్‌కు సమాచారం అందించి బియ్యం వ్యాపారి శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేశారు. బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.